

కథ 2006

9

# యూ... టర్న్

దగ్గుమాటి పద్మాకర్

మిస్టర్ సేన్. వ్యాపారవేత్తగా స్టాక్‌మార్కెట్‌లో సంచలనాలు సృష్టిస్తూ భారత దేశంలో తరచుగా వినిపించే పేరు. తలపండిన రాజకీయ నాయకులు సైతం ఆయన పిలుపును శుభసూచకంగా భావించే పేరు. భారత ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ నేరుగా పొందగలిగే పదిమంది వ్యక్తుల్లో ఒకరు.

కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్స్, హోమ్‌నీడ్స్, రెడీమేడ్స్, ఫిల్మ్ స్టూడియోస్, రియల్ ఎస్టేట్స్... తదితర భారీ వ్యాపార రంగాలలో తనదైన ముద్ర వేసుకొంటూ ఎదిగిపోతున్న కుబేర చక్రవర్తి.

ఆయనకు హైదరాబాదు, బంజారాహిల్స్‌లో ఒక నివాసం ఉంది. గత నాలుగు రోజులుగా అందులో ఉంటున్నాడు. ఈ రాత్రి రెండున్నర కావస్తున్నా కూడా ఆయనకు నిద్ర రావటంలేదు.

మిస్టర్ సేన్‌కు వ్యాపార లావాదేవీల సందర్భంగా నిద్రపట్టని రాత్రులు తరచుగా ఎదురవడం మామూలే. సాధారణంగా ఆయన సగటు సంపాదన రోజుకు పది హేను కోట్ల పైమాటే అంటుంటారు. వ్యాపారంలో అప్పుడప్పుడు జరిగే డీల్ సందర్భంగా హఠాత్తుగా మూడు, నాలుగు వందలకోట్ల ఆదాయం ఎదురైనప్పుడు కూడా ఆయనకు నిద్రపట్టదు. ఆ రాత్రి మోతాదు మించి డ్రింక్ తీసుకొన్నా నిద్ర రాదు.

ఆ సందర్భంలో కంప్యూటర్‌లో తన పర్సనల్ ఫైల్ ఓపెన్ చేసి తన ఆర్థిక సామ్రాజ్య విస్తరణలో తన అంతస్తులు పెంచే విశ్వాసపాత్రులైన (ఈ మాట ఆయనకు ఇలాంటి సందర్భంలో తప్ప నచ్చదు) వారి అందరి పేర్లను చూసి గుర్తు చేసుకొంటూ నలభై, యాభై మందిని వెతికి తలా కోటి రూపాయల చెక్ స్వహస్తాలతో రాసి సంతకం చేస్తూ తన ఆనందాన్ని క్రమేపి దించేసుకొని తృప్తిగా నిద్రపోతాడు. ఈ సలహా ఇచ్చిన తన మిత్రుడూ, పర్సనల్ సైకియాట్రిస్ట్ డాక్టర్ శాంతారాం పేరు సైతం ఆ పేర్లలో తప్పకుండా ఉంటుంది.

కాని ఈ రాత్రి సందర్భం అలా కాదు. అసలి లాంటి సందర్భం ఎన్నడూ ఎదురుకాలేదు. ఒక పెద్ద టైటానిక్ వంటి నౌకను చిన్న కాగితం పడవ అడ్డొచ్చి సవాల్ విసిరినట్టుంది.

ఇది, వ్యాపారంలో అయితే మిస్టర్ సేన్ జంకే వాడు కాదు. బిజినెస్‌లో మాఫియా లీడర్‌ని సైతం తన తెలివితేటలతో మట్టి కరిపించేవాడు. ఆనాడు మాఫియా లీడర్ జాఫర్‌బాయ్‌తో జరిగిన సమావేశంలో జాఫర్ బాయ్ నిజాయితీగా తనను మెచ్చుకొన్నాడు. "సేన్ భాయ్! మీ తెలివితేటలు అమోఘం. భారత అండర్ వరల్డ్ డాన్‌లలో ఒకడిగా ఉంటూ నేను చేసే ఏకైక రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మట్టి కరిపించి టేకోవర్ చేశారు. ఒక దశలో మీ అడ్డు తొలగించుకొనైనా నేను నెగ్గాలనుకొన్నాను. కానీ నేను వీధుల్లో నుంచి ఎదిగిన వాడిని. స్నేహం గురించి తెలిసినవాడిని. మీ స్నేహం రుచి గ్రహించినవాడిగా మిమ్మల్ని అంతమొందించాలన్న ఆలోచన వచ్చినందుకు నన్ను నేను నిందించుకొన్నానంటే నమ్మండి. దయచేసి మీరు దూరం ఆలోచించకండి! నేనిక నుంచి మిస్టర్ జాఫర్ కాదు. నా మిస్టర్‌ను మీకు సమర్పించుకొంటున్నాను. ఇక నుంచి మీరే మిస్టర్ సేన్," అంటూ తన బినామి వ్యాపారాన్ని అమ్మి వేశాడు జాఫర్‌బాయ్. ఆనాటి నుండి ఈనాటి

వరకు అన్ని వ్యాపార లావాదేవీలలో వసంత్‌సేన్‌కు బదులు మిస్టర్ సేన్‌గా ప్రపంచమంతటా పిలుస్తూ వుంటారు తనను. కానీ ఈనాడు ఎదురైన సవాల్ అటువంటి వ్యాపారపరమైనది కాదు.

తనను, తన సంపదను, తన లక్ష్యాన్ని, చివరికి తన జీవిత సర్వస్వాన్ని తలకిందులు చేస్తున్న సంఘటన జరిగిందీ రోజు. తమాషా ఏమిటంటే... ఇలా జరగడం లో ఇసుమంతైనా బాధగా అనిపించడం లేదు. సంతోషమూ లేదు. కాని తనకు నిద్రపట్టడం లేదు.

ఫోన్ తీసుకొన్నాడు, డాక్టర్ శాంతారాంకు చేద్దా మని. వద్దనుకొన్నాడు మళ్లీ! ఈరోజు నిద్రపట్టకపోవడం శరీరానికి సంబంధించిన సమస్య కాదు. మరి మనసుకి సంబంధించిన సమస్యా... కాదా? అవునా? ఈ సమస్యని ఇలా విశ్లేషించకూడదు అనుకొన్నాడు. మళ్లీ ఇది గతమూ... వర్తమానమూ... కాదు, భవిష్యత్తుకు సంబంధించిన సమస్య. ఎవరైనా భవిష్యత్తులో ఏమి చేయాలన్నది ఎవరో నిర్ధారించాలా?... ఏదో... కన్‌ఫ్యూజ్డ్ గా అనిపించి ఫోన్ పక్కన పెట్టాడు.

ఆ అమ్మాయి రూపం ఇంకా కళ్ల ముందే ఉంది.

పట్టుమని పదేళ్లు లేవు.

కొట్టొచ్చినట్టు కనిపించే అపోజిట్ కలర్ యూని ఫామ్‌కు పై భాగాన, ఆ మెరుపు కళ్ల అమాయకత్వం మరింత కొట్టొచ్చినట్టుగా ఉంది.

వేలాడే జుట్టుని బంధించలేక నిస్సహాయంగా వదులౌతున్న తెల్లని హెయిర్ బేండ్.

చిలిపిగా ఊగిసలాడే చిన్ని రింగులు.

పురాణకాలం నాటి పేరు... శకుంతల!

'ఎంత పని చేస్తున్నావు శకుంతలా,' అను కొన్నాడు మిస్టర్ సేన్.

*

మిస్టర్ సేన్‌కు ఒక్కగానొక్క కూతురు ఐఎఎస్ చేసి ప్రభుత్వ సర్వీస్‌లో ఉంది. ట్రైనింగ్ సమయంలోనే మరొక ఐఎఎస్‌ని ప్రేమించి పెళ్లి చేసుకొనింది.

మిస్టర్ సేన్ ప్రతి మూడు నెలలకు ఒకసారి త్రైమాసిక లాభాలను పరిశీలించుకొన్న అనంతరం రెండు, మూడు రోజులపాటు వ్యాపార సామ్రాజ్యాన్ని వదిలి భార్యతో కలిసి వివిధ దేశాలకు వెళ్లి విశ్రాంతి తీసుకొంటుంటాడు. ప్రకృతి ఎంత ఆహ్లాదకరమైనది అయినా, ప్రకృతిలో కలిగిన ఆనందాన్ని భార్యతో షేర్ చేసుకొన్నా ఏదో అసంతృప్తిగానే ఉంటూ ఉంది ఆయనకు ఈమధ్య. తనకు ఆనందాన్నిచ్చిన ప్రకృతితో తిరిగి అనుభూతుల్ని షేర్ చేసుకోలేకపోవడం రొటీన్‌గా వన్‌వేలా అనిపించి, గడిచిన రెండేళ్లుగా ఆ పద్ధతిని మార్చుకొని కొత్త కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. ఒక నూతన జీవితాన్ని పరిచయం చేసుకొంటున్నాడు. ఆయనకు ఈ ఆలోచన ఇచ్చింది కూడా డాక్టర్ శాంతా రాం.

ఆయన ఒకరిద్దరు సన్నిహితులతో కలిసి ఒకసారి- వేషం మార్చుకొని చిన్న నగరాల్లోని వీధుల్లో సాధారణ ప్రజానీకంలో కలిసి రెండు, మూడు రోజులు షాపింగ్ చేస్తూ తిరిగేవాడు. మరోసారి అలాగే కొన్ని గ్రామాల్లో గడిపాడు. ఒకసారైతే ఢిల్లీ నుండి మద్రాసు వరకు ఒక్క సహాయకుడూ లేకుండా ట్రైన్ జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేశాడు. ఆయనకు ఆ ప్రయాణం సాహసమే కాదు- దుస్సాహసంగా కూడా అనిపించింది.

ఈసారి తనకు చిన్ననాటి స్పోర్ట్స్ మిత్రుడొకరు హైదరాబాదులోని ప్రభుత్వ స్కూల్లో హెడ్మాస్టరుగా పనిచేస్తుంటే ఆ పాఠశాలకొచ్చి చిన్నపిల్లలకు పాఠాలు చెప్పు గడపాలనుకొన్నాడు. మూడు లేదా నాలుగు తరగతుల పిల్లల కోసం మూడురోజులు అవకాశం కావాలని తన మిత్రుడైన హెడ్మాస్టరుని అడగడం, ఆయన ఆనందంగా అంగీకరించడం జరిగి, ఒకరోజు హైదరాబాదుకు వచ్చాడు.

*

హైదరాబాద్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న చిన్న పాఠశాల అది. అయిదారు తురాయి చెట్ల నీడన పది గదులున్న పాఠశాల. ఆ వేసవి ఉదయం స్కూల్ ఆవరణలోకి తన మిత్రుడైన హెడ్మాస్టరుతో కలిసి అడుగుపెడుతున్న మిస్టర్ సేన్‌కి తురాయిచెట్ల ఎర్రని పూలు ఆవరణమంతా పరుచుకొని, చల్లని గాలితో రెడ్ కార్పెట్ వెల్కమ్ చెబుతున్నట్లుగా అనిపించింది.

పిల్లలు తనను అతి మర్యాదస్తునిగా చూడ కుండా ఉండేందుకుగాను ఆయన సూట్ వేసుకొని రాలేదు. షర్ట్ మీద రావాలంటే ఇబ్బందిగా అనిపించి ప్యాంటు, టీ-షర్ట్ ధరించి వచ్చాడు. ఎలాంటి స్ప్రేలు వాడలేదు. స్నోలు రాసుకోలేదు. హెయిర్‌క్రీమ్ కూడా వాడలేదు. సాధారణమైన కొబ్బరినూనె రాసుకొన్నాడు. స్కూలు ఆవరణలోకి ప్రవేశించగానే...

నమస్కారం సార్...!

గుడ్‌మాణింగ్ సార్...!

సార్...! నమస్తే సార్...!

వినయంగా దగ్గరకు వచ్చి, తమ దృష్టిలో పడి వేగంగా ఎటో వెళ్లిపోతున్నారు పిల్లలు. ఆఫీసులో కొంత సేపు హెడ్మాస్టరుతో గడిపాక మూడవ తరగతి పిల్లల క్లాసులోకి వెళ్లాలనుకొంటున్నట్టు చెప్పాడు.

స్కూలు వాతావరణాన్ని, పక్కన క్లాసు గదుల్ని పరిశీలించుకుంటూ క్లాసులోకి అడుగుపెడుతూనే మళ్లీ గుడ్‌మాణింగ్స్ మొదలయ్యాయి.

"వెరీ గుడ్‌మాణింగ్!" సమాధానమిచ్చాడు.

"గుడ్‌మాణింగ్ సార్!" వెనుక బెంచి నుంచి.

"యస్... గుడ్‌మాణింగ్!"

"నమస్తే సార్!"

"యస్... యస్... గుడ్‌మాణింగ్ ఆలాఫ్ యూ!"

ప్రభుత్వ స్కూలు కదా క్రమశిక్షణ అంతగా లేదు. అదీ సంతోషంగానే ఉంది. 'డేమ్ డిసిప్లిన్... మరీ మిలిటరీ క్రమశిక్షణ కూడా పిల్లల్లో పెల్లుబికే ఆలోచనా ధారల్ని కిల్ చేస్తుంది. నియమాలను ఉల్లంఘించాలన్న ఆలోచన ఉన్నవాడు మాత్రమే కొత్త నియమాలను రూపొందించగలుగుతాడు,' ఇలా అనుకొంటుండగా క్లాస్‌లో కాస్త సైలెన్స్ వచ్చింది.

"ఇంకా ఎవరైనా గుడ్‌మాణింగ్ చెప్పాల్సినవారున్నారా?" వెనుక బెంచి వైపు వేలు చూపిస్తూ, "నువ్వు చెప్పలేదు. నీ పేరేమిటి?" అడిగాడు.

ఆ అబ్బాయి టక్కున లేచి సెల్యూట్ చేసి, "గుడ్‌మాణింగ్ సార్," అన్నాడు.

"నీ పేరు?"

"లక్ష్మయ్య."

"ఇలారా! ఇక్కడికి."

కొత్త టీచర్‌ను చూసి వాడు భయపడ్డాడు.

"సరే! ఇక్కడకు ఎవరొస్తారో చెప్పండి."

ఒకమ్మాయి చెయ్యెత్తింది.

"నీ పేరు."

ఆ అమ్మాయి చేతులు కట్టుకొని దగ్గరకు వచ్చాక చెప్పింది, "మంజుల సార్."

"మీ నాన్న పేరు? చేతులు తీసెయ్యి!"

"నారాయణ సార్!"

"మీ అమ్మ పేరు?"

"లక్ష్మి సార్!"

"వెరీ నైస్. వెళ్లి కూర్చో," అని చెప్పి వరుసగా అందరి పేర్లు అడిగాడు.

"మీ క్లాసులో అమ్మాయిలు ఎంతమంది?"

ఒకమ్మాయి లేచి లెక్కపెట్టి చెప్పింది, "పదహారు సార్!"

"అబ్బాయిలు?" అడిగాడు వెంటనే.

ఒకబ్బాయి లేచి లెక్కపెట్టి చెప్పాడు, "ఇరవై రెండు సార్!"

మరొక అమ్మాయిని లేపి, "మొత్తం ఎంత మంది?" అడిగాడు.

ఆ అమ్మాయి వేళ్లు లెక్కపెట్టుకొంటుండడంతో కూర్చోమని, ఇంకో అబ్బాయిని అడిగాడు. వాడూ వేళ్లు తెరిచాడు. ఆ తర్వాత పిల్లలతో కథలు చెప్పించాడు. కొందరితో బోర్డుపై రకరకాల బొమ్మలు వేయించాడు. మధ్యాహ్నం కొందరితో హీరోల గురించి, హీరోయిన్ల గురించి మాట్లాడించాడు.

ఒకమ్మాయి అడిగింది, "నీ పేరేంటి సార్!"

"సేన్."

"వీడి పేరు కూడా శీనే సార్," ఇంకో అబ్బాయి వైపు వేలు చూపిస్తూ చెప్పాడొకడు.

తేరుకొని చెప్పాడు, "శీను కాదమ్మా- సేన్! వసంతసేన్!"

మొత్తానికి ఆరోజు ప్రతి ఒక్కరిని క్లాసులో ఇన్వాల్వ్ చేయించాడు మిస్టర్ సేన్.

ఆరోజు సాయంత్రం హైదరాబాదులో చెక్కతో చేసిన క్యూబ్స్ కోసం వెతికి చివరికి ఒక కార్పెంటర్‌ని పట్టుకొని పది సెట్లు 'ఒక అంగుళం' కొలతతో క్యూబ్ చేయించి, తెల్లని పెయింట్ వేయించి, ఒకపక్క ఖాళీగా వదిలి, మిగిలిన ఐదు వైపులా 1 నుంచి 5 వరకు, 5 నుంచి 9 వరకు, 10 నుంచి 15 వరకు ప్రతి జత మీద అంకెలు వేయించి, నాలుగు ఖాళీ డబ్బాలను, 5 పరమపద సోపానం చార్టులని కొని రాత్రి పదకొండు గంటలకు ఇంటికి చేరాడు.

మరునాడు క్లాసులో అందరినీ ఐదు జట్లుగా విడదీసి, పరమపద సోపానం ఆడించాడు. పిల్లలు ఆటలో లీనమైపోయి క్లాసంతా ఒకటే గోలగా ఉంది. ఆ సమయంలో పక్క క్లాస్ టీచర్ల వద్దకు వెళ్లి వారికి కలిగిన అసౌకర్యానికి సారీ చెప్పి మరీ వచ్చాడు. క్లాసులో పిల్లలు ఆటల్లో పదేపదే అంకెలను కూడవలసి రావడంతో పదిహేను లోపు వరకు కూడికలను చూడగానే చెప్పగలగడాన్ని ఆ క్లాసులోనే యాభై శాతం పైగా సాధించారు.

మరునాడు బోర్డు మీద 15+6, 9+7, 12+9 ఇలాంటివన్నీ రాసి అడిగాడు. పిల్లలు ఆ రాత్రి ఆటను,

అంకెలను ఊహించుకొని ఉండటంతో ఆ సమాధానాలు అంతే వేగంగా వచ్చాయి. తాము వేళ్లతో పని లేకుండా చెప్పగలగడం పిల్లలకు కూడా ఆశ్చర్యమనిపించింది. క్యూబ్స్ మీద ఇలా అంకెలను పెంచి రాసుకొని వారానికి రెండు మూడుసార్లు సాయంకాలం పూట ఆడుకొమ్మని చెప్పాడు. ఆరోజు క్లాసులో మాటల మధ్యన ఉన్నట్టుండి, తాను రేపు ఒక్కరోజు మాత్రమే వస్తానని రేపు మీ అందరికీ తలా ఒక గిఫ్ట్ ఇస్తానని, మీరు కూడా ఎంత చిన్నదైనా సరే తలా ఒకరు గిఫ్ట్ తెచ్చి ఇవ్వమని కాగితంపై బొమ్మ వేసుకొని వచ్చినా ఫరవాలేదని అందరినీ కోరాడు. పిల్లల్లో సగం దిగులు, సగం ఉత్సాహం కలిసి ముప్పిరికొన్నాయి సేన్ మాటలతో. ఇంకా కొన్నిరోజులు ఉండాలని పిల్లలు చాలాసేపు బతిమాలారు. సేన్ చిరునవ్వుతోనే అందరినీ తిరస్కరించి వీలు కాదన్నాడు.

మర్నాడు క్లాసులో సందడే సందడి! మిస్టర్ సేన్ క్లాసులో అడుగు పెట్టగానే దిగులు పక్కనపెట్టి రెట్టించిన ఉత్సాహాన్ని ప్రదర్శించారు పిల్లలు. అందరి కళ్లల్లో మెరుపు, అందరి పెదవుల్లో నవ్వు. ఎవరి కాళ్లు ఒకచోట నిలవడం లేదు. ఒక్కొక్కరినే పిలిచి తాను తెచ్చిన మ్యూజిక్ బాక్సులను తలా ఒకటి ఇచ్చాడు వరుసగా పిలిచి.

తర్వాత పిల్లలని వారు తెచ్చిన గిఫ్ట్‌ల గురించి అడిగాడు. కొందరు పువ్వుల బొమ్మలు వేసుకొచ్చారు. కొందరు జాతీయ జెండా బొమ్మ వేసుకొచ్చారు. ఒక అమ్మాయి 'వసంత్‌సేన్ సార్‌కి' అని గమ్‌తో రాసి దాని మీద స్పార్క్స్ చల్లుకొని వచ్చింది. ఒకడు కుక్కపిల్ల బొమ్మ తెచ్చాడు. కొందరు పెన్సిల్స్, మరికొందరు చాక్లెట్స్ తీసుకొచ్చారు. అందరూ ఒక్కటొక్కటే తెచ్చి టేబుల్ వద్ద నున్న మిస్టర్ సేన్‌కి ఇవ్వసాగారు. అందరూ అయిపోయారు అనుకుంటున్న సమయంలో చివరిగా ఒక అమ్మాయి లేచి వచ్చింది.

ఒక నల్లని క్యారీబ్యాగ్‌ను భారంగా మోసుకొంటూ దగ్గరకు వచ్చింది. రెండు కేజీల బరువు ఉండవచ్చు. ఆ బరువుకు క్యారీబ్యాగ్ చిరిగిపోయేలా అనిపిస్తుంది.

"ఏంటి ఇవన్నీ? చాలా బరువుగా ఉన్నాయే!" అడిగాడు మిస్టర్ సేన్.

"బలపాలు సార్!"

"బలపాలా! ఎందుకు?"

"మీకిద్దామని సార్!"

"ఇన్నా!" ఆశ్చర్యంగా అడిగాడు మిస్టర్ సేన్.

"నా దగ్గర ఇంక లేవు సార్! అన్నీ తెచ్చేశాను సార్!"

ఆ సమాధానానికి ఆ అమ్మాయి బుగ్గలు నొక్కి అడిగాడు సంతోషంగా.

"నీ పేరు?"

"శకుంతల సార్!"

"ఇన్ని బలపాలెక్కడివి?"

"దాచి పెట్టుకున్నాను సార్!"

అవన్నీ టేబుల్‌పై పోశాడు. సగం నిండిపోయినట్టుంది. కొన్ని కిందపడ్డాయి. వాటిని అపురూపంగా ఏరి తీసి, టేబుల్‌పైన పెట్టింది శకుంతల.

"ఇన్ని బలపాలు ఎందుకు శకుంతలా?"

"రాసుకొనేందుకు సార్!" అంటూ అమాయకంగానే చూసింది శకుంతల. ఆ చూపులో ఈయనేంది, ఇది కూడా తెలియని అమాయకుడా అన్న ప్రశ్న కూడా ఉంది.

"ఇన్ని బలపాలతో నువ్వు ఏమి రాస్తావు! మళ్లీ కొంటూనే, ముక్కలు చేసి దాచుకుంటావు. అవునా! ఇవన్నీ వేస్తే కదా! క్లాసులో కొన్నిసార్లు కొందరికి ఒక్క బలపం కూడా లేక దెబ్బలు తింటుంటారు కదా! నువ్వప్పుడు..." అంటుండగానే తన ఆస్తులు గుర్తొచ్చి ఏదో షాక్ తగిలినట్టనిపించింది మిస్టర్ సేన్‌కి. షాక్ క్రమంగా శరీరమంతా పాకి ఒళ్లు జలదరించింది. 'మై గాడ్!' అనుకొన్నాడు మనసులో.

నిలబడి ఉన్న శకుంతలకు దుఃఖంగా అనిపిస్తోంది. రెండేళ్లుగా అపురూపంగా దాచుకొన్న బలపాలు మంచి టీచర్ కదా అని బహుమతిగా తెచ్చిస్తే ఇలా వింతగా నన్నే ఎందుకు దోషిగా చూస్తున్నాడని భావిస్తుంది శకుంతల.

శకుంతల వైపు చూశాడు మిస్టర్ సేన్. శకుంతల తను కూడబెట్టుకొన్న ఆస్తిపాస్తులన్నీ ధారాదత్తం చేస్తోంది, తన మీద అభిమానంతో... ప్రేమతో...

క్షణం ముందు మెరుస్తున్న కళ్లు తడి నిండుతున్నాయి. గంతులేస్తుండిన చెవి రింగులు భారంగా అనిపిస్తున్నాయి. ఆ సమయంలో బలపాలన్నింటితో పాటు ఆత్మాభిమానం కూడా పోతుందన్న బాధ ఆ బాలికలో వ్యక్తమవుతోంది.

చటుక్కున దగ్గరకు తీసుకుంటూ అన్నాడు, "నోనో... నోనో... ఏడవద్దు! ఏయ్ శకుంతలా! నువ్వు

ఇంతకాలం వీటిని దాచుకున్నావు కదా! నువ్వు సంతోషంగానే ఇస్తున్నావా నాకు?''

తల ఊపింది శకుంతల సంతోషంగా.

శకుంతలని నుదుటి మీద ముద్దు పెట్టుకొని, నడుం మీద, భుజం మీద చేయి వేసి తీసుకెళ్లి సీట్లో కూర్చోబెట్టాడు. ఆ అమ్మాయికిచ్చిన ముద్దులో తగినంత ప్రతిఫలం తాలూకు గాఢత లేదనిపించింది మిస్టర్ సేన్‌కి. కారణం ఏం లేదు. శకుంతల షాక్ చేసింది తనను. శకుంతల సవాల్ చేసింది తనను.

కాసేపయ్యాక తన దగ్గరున్న కెమెరాతో క్లాసులో అందర్నీ విడిగా పది స్నాప్స్ తీసి తనూ కొందరితో తీయించుకొన్నాడు. శకుంతలతో ప్రత్యేకంగా మరొక ఫోటో తీసుకొన్నాడు. అందరికీ మళ్లీ కాపీలు పంపుతానని చెప్పి ఆ సాయంత్రం అందరి దగ్గర శెలవు తీసుకొన్నాడు. గంట తర్వాత స్కూల్ హెడ్మాస్టరుకు కూడా కృతజ్ఞతలు చెప్పి శెలవు తీసుకొని వచ్చేశాడు.

*

వ్యాపార సామ్రాజ్యంలో కుబేరుడైన మిస్టర్ సేన్ ప్రవర్తన అంతా ఒక పిల్ల చేష్టా? యాభై ఐదు యేళ్ల తన జ్ఞానం ఏమైంది. ఈ కాలమంతా ఎక్కడ జీవించాడు తాను. సరుకుల మధ్యన పడి మిగతా సమాజాన్ని, మానవుల్ని చూడ నిరాకరించాడా!

మిస్టర్ సేన్- మూడవ తరగతి, ఎ సెక్షన్.

బిల్‌గేట్స్- నాలుగవ తరగతి, బి సెక్షన్.

లక్ష్మీమిట్టల్- రెండవ తరగతి, ఎ సెక్షన్.

నవ్వుకొన్నాడు కాసేపు. తిరిగి తల పట్టుకొని... ''శకుంతలా శకుంతలా!'' అంటూ మళ్లీ పెగ్గు నోటి దగ్గర పెట్టుకొన్నాడు మిస్టర్ సేన్. తిరిగి ఆలోచించి మద్రాసులో ఉన్న డా॥ శాంతారాంకు ఫోన్ చేశాడు.

''సారీ డాక్టర్! డిస్టర్బ్ చేసినందుకు.''

''వెల్‌కమ్ మిస్టర్ సేన్! హౌ ఆర్ యూ!'' వాచీ కేసి చూసుకొంటూ, అడిగాడు మళ్లీ, ''ఎనీ ప్రాబ్లెమ్.''

''యస్ డాక్టర్! ఒక చిన్న కాగితం పడవ- పెద్ద నౌకను సవాల్ చేస్తూ వుంది.''

శాంతారాం ఊహించాడు. అయితే అది తప్పు! బిజినెస్ మేటర్ అనుకొన్నాడాయన.

''మిస్టర్ సేన్, మీరెక్కడున్నారు?''

''ప్రస్తుతం హైదరాబాదులో ఉన్నాను డాక్టర్.''

''మీకు బిజినెస్‌లో మొదటిసారిగా ఎదురుదెబ్బ తగిలినందుకు సారీ చెబుతున్నాను మిస్టర్ సేన్.''

పెద్ద నవ్వు నవ్వాడు మిస్టర్ సేన్.

''నో నో! డాక్టర్. అలాంటిదేమీ లేదు. కానీ...''

మధ్యలోనే అందుకొన్నాడు డాక్టర్, ''మీరంత ఫ్రీగా నవ్వుతున్నారంటే ఆర్థికపరమైన నష్టాలేమీ లేనట్లే. బట్ వాట్ మిస్టర్ సేన్?''

''దయచేసి మీరు మద్రాసు నుంచి వెంటనే బయలుదేరి రావాలి డాక్టర్. ఎయిర్ పోర్టుకు వెళ్లేసరికి మన ఫ్లయిట్ సిద్ధంగా ఉంటుంది. ప్లీజ్...!''

''యస్ మిస్టర్ సేన్! తప్పకుండా. మీతో గడపటం అన్ని సమయాలలోనూ సంతోషదాయకమే కదా! నేను బయలుదేరుతున్నాను.''

తర్వాత తన పి.ఎ.కి కాల్ చేసి మద్రాసు, హైదరాబాద్‌లో చేయవలసిన ఏర్పాట్ల గురించి చెప్పాడు మిస్టర్ సేన్.

*

తెల్లవారుఝామున మూడున్నర గంటలకు మిస్టర్ సేన్‌ని కలిశాడు డాక్టర్ శాంతారాం.

''గుడ్‌మాణింగ్ మిస్టర్ సేన్!'' అంటూ చేయి చాచాడు డాక్టర్.

''వెరీ వెరీ గుడ్‌మాణింగ్ డాక్టర్!''

''నాకిక్కడ నౌక ఒక్కటే కనిపిస్తుంది మిస్టర్ సేన్. కాగితం పడవ ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చా,'' చుట్టూతా కలయజూసి చిరుత్సాహం ప్రదర్శిస్తూ అన్నాడు డాక్టర్.

సిద్ధం చేసిన స్కాచ్ గ్లాసును డాక్టర్‌కు అందిస్తూ చెప్పాడు మిస్టర్ సేన్.

''అది నా మెదడులో ఉంది డాక్టర్!''

''మిమ్మల్ని ఇంతగా ఇబ్బంది పెట్టేంత సమస్య మీకెదురైనందుకు సారీ మిస్టర్ సేన్.''

''అదేం లేదు డాక్టర్!'' అంటూ జరిగిందంతా చెప్పుకొచ్చాడు మిస్టర్ సేన్.

ఒక్కక్షణం కళ్లు మూసుకొని, ''మీకేమనిపిస్తుంది ఇంతకీ,'' అడిగాడు డాక్టర్.

పెద్దగా తెరలు తెరలుగా, నిస్సంకోచంగా నవ్వుతూ, ''నా వేల కోట్ల రూపాయల పెట్టుబడులన్నీ బలపాల రాశులుగా కనిపిస్తున్నాయి డాక్టర్!''

''ఈ సమస్యను మీరు సులభంగానే దాటగలుగుతారనిపిస్తుంది మిస్టర్ సేన్. మీరు హాయిగానే నవ్వగలుగుతున్నారు.''

''నో డాక్టర్! ఈ నవ్వు మీ ప్రశ్నకు నా సమాధానంలో భాగంగా మాత్రమే వచ్చింది.''

డాక్టర్ మిగిలిన సగంగ్లాసును ఖాళీచేసి అన్నాడు. "సో! వన్ స్లేట్ పెన్సిల్ ఈజీక్వల్ టు వన్ క్రోర్ రూపీస్," నిట్టూర్చి చెప్పాడు డాక్టర్.

"ఈమధ్యనే ఒక పుస్తకం చదివాను మిస్టర్ సేన్."

మధ్యలోనే అందుకొన్నాడు మిస్టర్ సేన్, "ఏమిటది?"

"కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మేన్."

"ఈజిట్! చాలా సాహసం చేశాడే. పేరేమిటి? అమెరికా విషయంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు తప్పించి మావంటి మిగతా వ్యాపారస్తులంతా భయపడుతూనే ఉన్నారు డాక్టర్."

"అతని పేరు జాన్ పెర్కిన్స్! అందులో చివరి వాక్యం ఒకటుంది మిస్టర్ సేన్. అది నన్ను బాగా ఆలోచనకు గురి చేసిందంటే నమ్మండి."

"చెప్పండి మరి!"

"మీ జీవితంలో జరిగిన కొన్ని యాదృచ్ఛిక ఘటనలు, అప్పుడు మీరు తీసుకొన్న నిర్ణయాల ఫలితం గానే మీరిక్కడ ఉన్నదివ్వాళ అంటాడు. అదే చివరి వాక్యం. ఇప్పుడు చెప్పండి. మీ జీవితంలో శకుంతల ఇన్సిడెంట్ కూడా యాదృచ్ఛికమైనదే. అది మిమ్మల్ని చలింపజేయడంలోనే మీ సున్నితత్వం, మీ సహృదయం, మీ సంస్కారం ఆవిష్కరింపబడుతున్నాయి. భారతీయుల గొప్పతనం ఇక్కడే ఉంది మిస్టర్ సేన్. తగిన సందర్భం వచ్చినప్పుడు భారతీయులు తమ జీవితాలను తప్పక పునశ్చరణ చేసుకొంటారు."

"మే బీ! బిజినెస్ దాటి పక్కకు ఆలోచించే అలవాటు నాకు తక్కువ డాక్టర్. ప్రతిసారీ మీరే నాకు కొత్త ఆలోచనలు పరిచయం చేస్తున్నారు. ఇందుకు మీకు థాంక్స్ చెప్పుకోవాలి."

"ఇదీ ఒక రకంగా నిజమే మిస్టర్ సేన్. జీవితంలో నమ్మినదాన్ని ఆచరించేవాళ్లే చాలా గొప్పవాళ్లు. సాధారణంగా ప్రజలందరూ నమ్మినదానినే ఆచరిస్తారని మీరనవచ్చు. దేనినైనా కోల్పోవలసి వచ్చినప్పుడే తన నమ్మకంపట్ల తనకు గల నిజాయితీ మనిషిని నిలదీస్తుంది. అలా కోల్పోయేందుకు సిద్ధపడనివారి నమ్మకం అనుమానాస్పదం అవుతుంది."

"అలా కోల్పోవడానికి సిద్ధపడకపోతే వారు నిజాయితీ లేని వ్యక్తులంటారా?"

"ఇది నిజాయితీ సమస్య కాదు మిస్టర్ సేన్. దీనిని సాపేక్షం అంటాను నేను. ఒక అనుభవం చెప్తాను. నా దగ్గరకు డెబ్భైయేళ్ల వయస్సుగల ఒక వృద్ధ పేషంటును తీసుకొని ముప్పై ఐదు, నలభై వయస్సు గల ఇద్దరు యువకులు వచ్చారు. వారు స్కార్పియో కారులో వచ్చినట్టు వారి కీచెయిన్ ద్వారా గ్రహించాను. వారీనాడు ఒక ఆధునిక భవంతిలో నివసిస్తున్నారు. ఆ వృద్ధుని కోరిక మేరకు అతను కట్టించిన పాత మిద్దె ఇల్లు మార్చకుండా, రీమోడల్ చేసి ఆధునిక భవంతిగా మూడు అంతస్తులతో కట్టుకొన్నారు. వారిప్పుడు ఇరవై ముప్పై కోట్ల ఆస్థిపరులు. ఆ వృద్ధుడు యువకునిగా ఉన్నప్పుడు సైకిల్ మీద బియ్యం మూటలు మోస్తూ కాలక్రమంలో వ్యాపారంచేసి సంపాదించాడు. సమస్య ఏమిటంటే, ఆ సైకిలు వరండాలో తాను గతంలో వుంచిన ప్రదేశంలోనే ఇప్పటికీ ఉండాలంటాడు వృద్ధుడు. దానిని అమ్మనీయకపోవడమే కాకుండా ఆ స్థానం నుంచి తీసేందుకు కూడా ఒప్పుకోవడం లేదు. అతిథులకు అది ఒక దిష్టిబొమ్మలా ఉందని కొడుకుల వాదన.

"ఇక్కడ సైకిల్‌పై అతని నమ్మకం దైవాంశతో సమానం. ఆ మహాలక్ష్మి సంపాదించిపెట్టడం వల్లనే తామీ స్థితిలో ఉన్నామంటాడు అతను. కొడుకులు మాత్రం డబ్బును డబ్బే సంపాదిస్తుందని నమ్ముతున్నారు. కాబట్టి, సైకిల్ దిష్టిబొమ్మ అని వారి ఉద్దేశం. తాము గతంలో పేదవాళ్లమని అది అందరికీ చాటడం వల్ల అవమానకరమని కొడుకుల వాదన."

"వెరీ ఇంట్రెస్టింగ్. మీరేం చెప్పారు?" కుతూహలంగా అడిగాడు మిస్టర్ సేన్.

"కొందరు దేవుడే లేడంటారు. మరికొందరు సైకిళ్లనీ దేవుడంటారు. ఇద్దరి నిజాయితీని శంకించలేం మిస్టర్ సేన్. దీన్ని ఇంతటితో వదిలేద్దాం."

"మీ సలహా వినాలని ఉంది డాక్టర్."

"మీరేమీ ఫీల్ కాకూడదన్న కండీషన్ మీద అయితేనే చెప్తాను మిస్టర్ సేన్."

"మీరు మిస్టర్ సేన్‌తో మాట్లాడుతున్నారు డాక్టర్!"

"ఆ వృద్ధుడు సైకిల్‌పై తనకు గల ఇష్టాన్ని వ్యక్తీకరించే సందర్భంలో, తన దేవతకు అవమానం జరిగినట్లుగా భావించి, తీవ్ర భావోద్వేగానికి లోనై, నా ఎదుటనే మరణించాడు మిస్టర్ సేన్."

"మైగాడ్!"

గాజుకళ్లలా మారిన మిస్టర్ సేన్ కళ్లలోకి చూస్తూ చెప్పాడు డాక్టర్. "సో...! మళ్లీ మొదటికొస్తాను మిస్టర్ సేన్."

"యసెస్... మనం చాలా దూరం వెళ్లిపోయాం."

"సో! మనం నమ్మినదాన్ని వాస్తవదృష్టితో బేరీజు వేసుకోవాలి నిజాయితీగా."

"ఆ డెబ్బై ఏళ్ల వృద్ధుడికి నిజాయితీ ఉందిగాని, వాస్తవదృష్టి లేదు కదూ..."

"కాదు మిస్టర్ సేన్. వాస్తవదృష్టిని అంగీకరించడానికి అవసరమైన ధైర్యం మాత్రమే అతనికి లేదు. అతనికి కొడుకుల వాదన పూర్తిగా తెలుసు. నమ్మిన దాన్ని ఆచరించేందుకు చాలా ధైర్యం కావాలి మిస్టర్ సేన్. బహుశా ప్రపంచ జనాభాలో వారి శాతం పదికి లోపే ఉంటుందని నా భావన. కొన్ని సంఘటనలు కొందరి జీవిత స్వరూపాలను మాత్రమే మార్చివేస్తాయి. కొన్ని నిర్ధారణలు ప్రజలందరి జీవిత స్వభావాలను సైతం మార్చివేస్తాయి. ఏది ఏమైనా అవి వ్యక్తుల మెదళ్లలోనే జనిస్తాయి. సోక్రటీస్ విషం తాగాడు. కార్ల్ మార్క్స్ దేశ బహిష్కరణకు గురైనాడు. ఏసుక్రీస్తు శిలువ వేయబడ్డాడు. బుద్ధుడు కుటుంబాన్నీ, రాజ్యాన్నీ కూడా వదులుకొన్నాడు. అశోకుడు ఖడ్గాన్ని కిందపడేశాడు. వీరంతా దృఢచిత్తం కలిగినవారు. అంకితభావం దృఢ చిత్తానికి తల్లి వంటిది అంటారు. నా మెడికల్ ఫీల్డ్‌లో ఒక క్యాలెండర్‌లోని ఫోటో నన్ను వృత్తి పట్ల అంకిత భావాన్ని నిరంతరం ప్రేరేపిస్తుందంటే నమ్మండి మిస్టర్ సేన్."

"ఏంటది?"

"అర్ధరాత్రి దాటి ఒక సైంటిస్టు తన ఇంటి వరండాలో వివిధ రసాయనాలు గల టేబుల్ ముందర నిలబడి తదేక దీక్షతో పరీక్షనాళిక లోనికి ద్రవాన్ని వంచుతూ ఉంటాడు. అతని వెనుకవైపుగా తలుపు వెనుక నుండి ఆయననే పరిశీలిస్తూ, ఆయనకై ఎదురు చూస్తూ మత్తు కనులతో నిలబడి ఉంటుంది భార్య. త్యాగం మిస్టర్ సేన్! మనకు ముందు తరాలు తాము కాలాన్నీ, జీవితాన్నీ త్యాగంచేసి మనకు కల్పించిన సకల సౌకర్యాలనీ మనమిప్పుడు అనుభవిస్తున్నాం. కానీ శాస్త్రవేత్తలు పది సంవత్సరాల పాటు కొనసాగించిన ప్రయోగాలను కూడా ఫలితాలు వ్యర్థమని తేలితే నిర్దాక్షిణ్యంగా మూలన పడేస్తారు."

"చాలా నిజం డాక్టర్."

"ఇప్పుడు, మీ సంపద అంతా బలపాల రాశులుగా అనిపిస్తే... అనిపించనివ్వండి మిస్టర్ సేన్. మీరు కొత్తదనాన్ని సహజంగానే ఆహ్వానిస్తారు గదా! మీరు ఒక కొత్త సత్యాన్ని ఆవిష్కరించినట్లే గ్రహించండి చాలు."

"అది నిజమే డాక్టర్! నిజానికి నేనింతవరకు చిన్నపిల్లాడిలా ప్రవర్తించానా అనేదే నన్ను వేధిస్తుంది. డబ్బు సంపాదించడం ఫూలిష్ వ్యవహారంలా అనిపిస్తుంది. నా తండ్రి నాకు వందకోట్ల ఆస్తినిచ్చాడు. నేను దాన్ని వంద రెట్లలో పెంచాను. ఇదంతా అమ్యూజ్‌మెంట్ పార్కుల్లోని గేమ్స్‌లో నేర్పు గల బాలుని విజయంలాగే ఉంది డాక్టర్."

"నిజమే మిస్టర్ సేన్. ఆ అమ్యూజ్‌మెంట్ పార్క్ నుండి బయటకు రావడంతోటే ఎవరికైనా ఒక రకమైన నిర్లిప్తత, నైరాశ్యం ఆవహిస్తుంది. లక్షల కోట్లు సంపాదించినా ఆ తదనంతరం ఒక దశలో ప్రపంచంలోని ఏ ఒక్కరూ ఈ నిర్లిప్త భావాల నుండి తప్పించు కోలేరు. ఇన్ఫినిటీ అనేది అంతంలేని దానికి ఒక సంకేతం మాత్రమే కదా. ఆ సంఖ్య ఊహించేవారి ఊహాశక్తిని బట్టి ఉంటుంది. తగినంత ఊహాశక్తి లేకుండా దానిని చేరుకోవాలని పాకులాడేవారు జారిపోక తప్పదు. ఆ ప్రయాణంలో హఠాత్తుగా కన్ను మూసేవారి సంగతేమోగాని మిగిలినవారు మాత్రం తాము జారిపోతున్న విషయాన్ని తప్పక గ్రహిస్తారు కొన్ని అనుభవాలు ఎదురైనప్పుడు. వెయ్యి తరాలకు అవసరమైనంత డబ్బు ఒక్కచోట పోగేయగలం కాని, మన జీవితమంతా తినవలసినదాన్ని ఒకేసారి తినివేయలేము గదా మిస్టర్ సేన్. ప్రస్తుతానికి మీకు ఒక విషయం మాత్రం చెప్పగలను."

"వెల్‌కం డాక్టర్!"

"మీ కాలాన్ని వీలైనంతగా డబ్బు వ్యాపకాల నుండి మళ్లించండి. వీలైనంత ఉల్లాసంగా, వీలైనంత ప్రశాంతంగా గడిపే ప్రయత్నం చేయండి."

"డాక్టర్ మీరు దాటవేయడం లేదు కదా! నేను నా సంపాదన... ఐ మీన్... బలపాల గురించి అడుగుతున్నాను," అప్రయత్నంగా నవ్వాడు మిస్టర్ సేన్.

ఆ నవ్వు డాక్టర్ విషయాన్ని దాటవేయడాన్ని తాను గ్రహించినట్టుగా నవ్వాడో, డబ్బు కోల్పోతున్న విషయంలో నేను సీరియస్‌గా లేనని డాక్టర్‌కు తెలిపేందుకు నవ్వాడో ఆయనకే తెలియదు.

డాక్టర్ కూడా చప్పుడు రాని ఒక చిన్నపాటి నవ్వు నవ్వి... కాసేపు భృకుటి ముడివేసి, చూపుడు వేలితో తల పట్టుకొని... మళ్లీ తీసి... హఠాత్తుగా మిస్టర్ సేన్ వేపు చూస్తూ అన్నాడు.

"ఒక పనిచేయండి మిస్టర్ సేన్. అది కూడా నా సలహాను మీరు ఖచ్చితంగా విశ్లేషించుకొని మరీ ఆచరించవలసినదిగా ప్రేమపూర్వకమైన అభ్యర్థన కూడాను.

మీకు గనుక మీ తదుపరి తరాల వారసులపై సాపేక్ష మైన ప్రేమ మాత్రమే కలిగి ఉండే పక్షంలో- ఒక పది తరాలకు విల్లు రాసి, మిగిలిన ఆస్తిని మీకు బలపాల వలే అనిపిస్తే- భారత ప్రభుత్వం ఏ రంగానికైతే నిధులు తక్కువగా కేటాయిస్తుందో అందుకై వినియోగించండి.''

''యూ మీన్ ఎడ్యుకేషన్...''

''అవును... మిస్టర్ సేన్! భూగర్భంలోని ఖనిజాలను, వాయువులను, వజ్రాలను, చివరకు రాళ్లను కూడా తవ్వుకొచ్చి కనీసం వ్యాపారం పేరుతోనైనా వినియోగంలోకి తెస్తున్నాం. కాని మట్టిలో పుట్టి మట్టిలో కలిసిపోతున్న వారికి జ్ఞానాన్ని అందించి, తిరిగి దానిని వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నాం. వీలైతే మీరు పూనుకోండి. మీరు కట్టించ గలిగినన్ని స్కూళ్లు గ్రామాలలో కట్టించండి. 25 సంవత్సరాలపాటు ఒక తరమంతా చదువుకొనేందుకు అవసరమైన అన్ని వసతులతో భావిభారత పౌరులకు విద్యాదానాన్ని చేయించండి. మీతోపాటుగా, ఆర్థికంగా పైకి వచ్చిన ప్రతి విద్యావంతుడూ తాను అ... ఆ...లు నేర్చుకొన్న బడికి తగినన్ని నిధులిచ్చే విధంగా విద్యుక్తపరచండి. సంపదలో మీరు ఉన్నతంగా ఉండడం కంటే, జ్ఞానంలో దేశం ఉన్నతంగా ఉండడం మీకు అభ్యంతరం కాదు కదా! మీవంటి, మీ వారసురాలు శకుంతల వంటి సర్వస్వం త్యాగం చేయగల ధీరోదాత్తులను తయారుచేయగల స్కూళ్లను, హృదయ వైశాల్యాన్ని పెంచే విద్యను దేశానికి అందించండి. ఇండియన్ రూజ్‌వెల్ట్‌గా చరిత్రలో నిలిచిపోండి.''

ప్రశాంతంగా విని, ''నేనీ విషయాన్ని అంగీకరించను డాక్టర్,'' తల అడ్డంగా ఊపుతూ అన్నాడు మిస్టర్ సేన్.

''ఏ విషయాన్ని మిస్టర్ సేన్.''

''శకుంతల నా వారసురాలు అనడాన్ని! నిజానికి నేనే ఆమెకు వారసుణ్ని! మీరు సవరించుకోవాలి.''

మిస్టర్ సేన్ నవ్వులో శృతి కలిపాడు డాక్టర్.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 6 ఆగస్టు 2006*

